

# రెప్పల మీద నీడలు

## – అత్తలూరి విజయలక్ష్మి



## (గత సంచిక తరువాయి)

4

**అతని గది విశాలంగా ఉంది**. ఒక పక్క పుస్తకాల రాక్ మరో పక్క అలమరా, మధ్యలో కిటికీ దగ్గరగా రైటింగ్ టేబుల్, కిటికీలో ఒక గాజు సీసాలో మనీ ప్లాంట్, ఒక మూలగా పియానో. మరో వైపు మంచం... బెడ్షీట్ ఎక్కడా ముడతలు లేకుండా, నీటుగా కప్పి ఉంది.

"కూర్చో", ప్లాస్టిక్ కుర్చీ ఆమె దగ్గరగా జరిపి, పియానోకి దగ్గరగా ఉన్న స్టూల్ మీద కూర్చున్నాడు.

వీడి మొహానికి ఈ పియానో ఎందుకో అనుకుంటూ నిర్లక్ష్యంగా కూర్చుంది.

నెమ్మదిగా అతని వ్రేళ్ళు పియానో మెట్ల మీద కదులుతూ కాసేపట్లో ఆమెకి తెలియకుండానే అందులో లీనమై పోయేలా అద్భుతంగా వాయించసాగాడు. అప్పటివరకు అసలు పియానో అంటే ఏమిటి, ఆ ధ్వని ఏమిటి, అందులో ఏ రాగాలు వినిపించవచ్చు , ఏ పాటలు పాడచ్చు అనే విషయంలో ఏ మాత్రం అవగాహన లేని పవిత్ర మంత్రముగ్ధురాలు అయినట్టు, బొమ్మలా కూర్చుండి పోయింది.

కారులో షికారుకెళ్ళే పాలబుగ్గల పసిడిదానా! బుగ్గమీద గులాబీరంగు ఎలా వచ్చెనో చెప్పగలవా?

హటాత్తుగా పాట మారిపోడంతో ఉలిక్కిపడి అతనివైపు చూసింది.

తనవైపే చూస్తూ, వాయిస్తున్నాడు. ఆ చూపుల్లో చిలిపితనం గంతులేస్తోంది.

కింద నుంచి "పవిత్రా! " అని చాముండేశ్వరి స్వరం గట్టిగా వినిపించడంతో మోహన్ పియానో మీటడం ఆపేసాడు.

పవిత్ర అతనివైపు, పియానోవైపు మార్చి, మార్చి చూసి, చివుక్కున కుర్చీలోంచి లేచి, గిర్రున తిరిగి రెండేసి మెట్ల చొప్పున దిగుతూ కిందకి వెళ్ళిపోయింది. ఆమె అలా దిగుతుంటే చెంగు, చెంగున ఎగురుతున్న లేడిపిల్లలు గుర్తొచ్చాయి.

మోహన్ కూడా అదే వేగంతో లేచి ఆమె వెనకాలే మెట్లు దిగుతూ "బాగా వాయించానా?" అని అడిగాడు.

సమాధానం చెప్పకుండా చటుక్కున ఆఖరిమెట్టు దిగి, వంటగదివైపు పరిగెత్తింది.

మోహన్ మనసు చివుక్కుమంది. మర్యాదకైనా బాగుంది అని చెప్పచ్చు కదా అనుకున్నాడు.

నెమ్మదిగా వివేకం నచ్చచెప్పింది. "ఎంతైనా గొప్పవాళ్ళ అమ్మాయి కదా! ఈ మాత్రం పొగరు ఉంటుంది."

నిజమే! వెంటనే తన గొప్పతనం ఒప్పుకోడానికి ఆమెకి అంత పెద్ద మనసు ఉండాలిగా! ఎలా ఉంటుంది! ఇంకా చిన్నదేగా! పెద్దమనసు ఎలా ఉంటుంది? నవ్వుకున్నాడు. తప్పకుండా ఆమెకి తన పియానో వాయిద్యం నచ్చే ఉంటుంది. మరోసారి వస్తుంది అనుకున్నాడు నమ్మకంగా .

చాముండేశ్వరి అమ్మవారికి పూజ ఎంతో భక్తిగా చేసుకుంది.

పూజ మధ్యలో నాంచారమ్మ, ఆవిడ కోడలు వర్దని ఇద్దరూ వచ్చారు. వాళ్ళ చేతిలో పెద్ద పళ్ళ బుట్ట ఉంది.

వాళ్ళని చూసి పలకరింపుగా నవ్వి కూర్చోండి అన్నట్టు సైగ చేసింది చాముండేశ్వరి.

ఇద్దరూ పవిత్ర పక్కనే చాప మీద కూర్చున్నారు.

పుజారిగారు స్పష్టంగా, స్వచ్చంగా మంత్రాలు చదువుతున్నారు.

పవిత్ర అలంకరించిన అమ్మవారిని పరీక్షగా చూస్తూ కూర్చుంది.

ఎర్రని కంచి పట్టు చీర కట్టి, పసుపు రాసిన కొబ్బరికాయకి కళ్ళు, చెవులు , బొట్టు పెట్టి, ముందునించి వెనక్కి సవరంతో పూలజడ కుట్టారు. మెడనిండా చంద్రహారం, నెక్లెస్, ముత్యాల హారాలు అలంకరించి, అట్ట చేతులకి నిండుగా ఎర్ర మట్టిగాజులు మధ్యలో బంగారు గాజులు తొడిగారు. అక్కడ అమ్మవారు సజీవంగా కూర్చున్నట్టే అనిపించింది పవిత్రకి. అప్రయత్నంగా ఆమె రెండు చేతులు జోడించింది.

పూజ పూర్తి అయింది, తీర్థ, ప్రసాదాలు అయ్యాక పవిత్రకి బొట్టు పెట్టి, గంధం పూసి, కాళ్ళకి పసుపురాసింది. ఆవిడ తన కాళ్ళు ముట్టుకుంటుంటే వద్దండీ అంది పవిత్ర కాళ్ళు వెనక్కి లాక్కుని.

"పర్లేదమ్మా ఇప్పుడు నువ్వు సాక్షాత్తూ అమ్మవారివి... నీ కాళ్ళు పట్టుకుంటే తప్పులేదు." అంటూ తిరిగి పవిత్ర పాదం కుడిచేత్తో లాక్కుని, సున్నం కలిపిన పసుపు పారాణిగా పెట్టింది.

పెద్ద ట్రేలో పట్టు చీర, తమలపాకులు, వక్క, పూలు, పళ్ళు పెట్టి పవిత్రకి ఇచ్చింది. తన పాదాలకి నమస్కరిస్తున్న ఆవిడని చూసి భయంగా నాంచారమ్మ వైపు చూసింది.

ఆవిడ పర్లేదు అన్నట్టు కళ్ళతో సైగ చేసింది.

కళ్ళు పైకెత్తి తన వైపు ఆశ్చర్యంగా చూస్తున్న పవిత్రతో అంది చాముండేశ్వరి. "లోపలికి వెళ్లి ఈ చీర కట్టుకునిరా తల్లి."

పవిత్ర అయోమయంగా తల్లివైపు, నానమ్మ వైపు చూసింది.

వెళ్ళు అన్నట్టు సైగచేసారు ఇద్దరూ.

పవిత్ర చాముండేశ్వరి చూపించిన గదిలోకి వెళ్ళింది.

ఆమె వెనకాలే వర్దని కూడా వెళ్లి తలుపు వేసింది.

“ఏంటమ్మా ఇదంతా! ఆవిడ నాకు దణ్ణం పెట్టారేంటి? ఈ పట్టు చీర ఇవన్నీ ఏంటి?” అయోమయంగా అడిగింది తల్లిని పవిత్ర.

“దసరా నవరాత్రులు అమ్మవారిని రక,రకాలుగా పూజించి, రోజుకో ముత్తైదువని అమ్మవారిగా భావించి పూజిస్తారు... నిన్నటినుంచే నవరాత్రులు మొదలు. మొదటిరోజు బాల... ఐదేళ్ళ లోపు పిల్లలని అమ్మవారిగా భావించి పూజిస్తారు. ఈరోజు రెండో రోజు, బాల కుమారిగా ఎదిగింది. అందుకే కన్నెపిల్లని పూజిస్తారు. “

ఆవిడ వివరంగా చెప్తోంటే నోరు తెరిచి వింటూ, తల్లి చీర కడుతున్నంత సేపూ ఆలోచిస్తూ ఉండిపోయింది పవిత్ర.

ఎవరు చెప్పారు ఇలా చేయాలని. ఎందుకు చేస్తారు? చాముండేశ్వరిగారు అందంగా ఉంటారు. పార్ధసారధి గారు చాలా మంచివారు అని చెప్తూ ఉంటుంది నానమ్మ. పిల్లలున్నారు. బోలెడంత డబ్బుంది వాళ్లకి. కొత్తగా ఆ ఊరు వచ్చారు కాబట్టి, అద్దె ఇంట్లో ఉంటున్నారుగాని ఇంతకన్నా పెద్ద మేడ కట్టుకోగలరు. ఇంకా ఏం కావాలి? ఎందుకు ఇంత పెద్ద పూజ చేసారు?

“అమ్మా! ఇంత పూజ చేసి ఆవిడ అమ్మవారిని ఏం కోరుకుని ఉంటారు?” అడిగింది.

ఆవిడ నవ్వింది. “ ఇప్పుడింక ఆవిడకి ఏం కావాలి? జీవితాంతం తన పసుపు, కుంకుమలు నిలవాలని, చిరకాలం సౌభాగ్యంతో జీవించాలని తప్ప” అంది

అంటే! “

“అంటే ఏవిటే నీ పిచ్చి ప్రశ్నలు నువ్వూనూ! ప్రశ్నలతో చంపుతున్నావు. చెంగు ఇలా పట్టుకో, పట్టుచీర కుచ్చిళ్ళు నిలవవు..” అంది వర్దని పమిట కొంగు పవిత్ర చేతికిచ్చి , కుచ్చిళ్ళు సర్దుతూ.

“అదికాదమ్మా! ఆవిడ పెద్దావిడ కదా నాకు కాళ్ళకి దణ్ణం పెట్టారేంటి? నాకు చాలా ఇబ్బందిగా అనిపించింది. “ అంది పవిత్ర.

“ఈ రోజు నీలో ఆవిడ అమ్మవారిని చూసుకున్నారు. దణ్ణం పెట్టింది నీక్కాదు అమ్మవారికి. ఆ చెంగు ఇలా ఇవ్వు పిన్ను పెడతాను.” అంటూ పవిత్ర చేతిలో నుంచి పైట చెంగు అందుకుని, ఒద్దిగ్గా మడతలు పెట్టి భుజం మీద జాకెట్టుకి , కొంగుకీ కలిపి పిన్నీసు పెట్టింది. “ఒకసారి నిలువెల్లా కూతురుని చూసుకుని, “పెళ్లి కూతురులా ఉన్నావు పద “ అంది చేయి పట్టుకుని.

“కాళ్ళకి కుచ్చిళ్ళు తట్టుకుంటున్నాయి. నడవలేకపోతున్నా “ అంది మొహం అదోలా పెట్టి పవిత్ర.

“అలవాటు అవుతుందిలే... “ అంది ఆవిడ తేలిగ్గా.

బుట్టబొమ్మలా వచ్చిన పవిత్ర వైపు మురిపెంగా చూసింది చాముండేశ్వరి.

“బంగారు బొమ్మండి పిన్నిగారూ మీ మనవరాలు” అంది.

పవిత్ర సిగ్గుగా నవ్వి తల తిప్పేసరికి గుమ్మంలో నిలబడి తనవైపే చూస్తున్న మోహన్ కనిపించాడు.

నవ్వుతో పువ్వులా విచ్చుకున్న ఆమె మొహం అతన్ని చూడగానే ముకుళించుకుపోయింది. నొసలు చిట్లించింది.

ఆమె మొహంలో నిరసన గమనించిన మోహన్ మనసు చివుక్కుమంది. వెనక్కి తిరిగి వెళ్లిపోబోతుంటే, చాముండేశ్వరి "మోహన్! నాన్నగారికి చెప్పు భోజనం సిద్ధంగా ఉంది కాళ్ళు కడుక్కోమను" అంది.

"అలాగే అమ్మా!" అంటూ తలవంచుకుని అక్కడి నుంచి వెళ్ళిపోయాడు మోహన్.

"పిన్నిగారూ! ముందుగా పవిత్రకి భోజనం పెట్టేయనా!" నాంచారమ్మని అడిగింది చాముండేశ్వరి.

"మగవాళ్ళు తిననివ్వండి. తరవాత అందరం ఒకేసారి తిందాము. అంతగా మీకు మీ అమ్మవారు తినకుండా వాళ్లకి ముందు పెట్టడం ఇబ్బంది అనిపిస్తే, దానికి ఓ బూరె ఇచ్చేయండి... తిన్నట్టే అనుకోవచ్చు " అందావిడ తేలిగ్గా. సంప్రదాయాలను, ఆచారాలను సమయానికి అనువుగా మార్చుకునే సదరు మహిళల్లో ఆవిడ కూడా ఒకతి. ఎందుకు సంప్రదాయాలు పాటించాలో, ఎందుకు సవరణలు చేసుకోవచ్చో తెలియదు ఆవిడకి కూడా కానీ చేస్తుంటుంది. ఆవిడ ఉద్దేశంలో పూర్వీకులు తర,తరాలుగా వస్తున్న అలవాట్లకి ఆచారాలు అనే పేరు పెట్టుకున్నారు అని నమ్మకం.

కొన్ని ఆచారాలను సింగినాదం అని కొట్టిపారేస్తుంది, కొన్నిటిని యధాతథంగా కాకున్నా పాటిస్తుంది. ఆవిడ వయసు ఉన్న ఇతర స్త్రీల లాగా ప్రతి చిన్న ఆచారం కచ్చితంగా పాటించదు. పైగా అందరినీ ఏవిటా చాదస్తం ఈ రోజుల్లో కూడా అని మడిపేరుతో తడిచీర కట్టుకుని వంటలు చేసే స్త్రీలను గట్టిగా మందలిస్తుంది. ఒక చీర శుభ్రంగా ఉతికి ఎవరూ తాకకుండా పెరట్లో ఓ మూల ఆరేసుకుని కట్టుకోవచ్చు, జలుబు చేసి, జ్వరాలు వచ్చి, న్యుమోనియా గా మారితే ఎవరికీ కష్టం? అని.

"మావయ్యగారికి అలా ఇష్టం లేదు పిన్నిగారూ" అని ఎవరన్నా అంటే, " ఇష్టం ఉన్నా, లేకపోయినా నువ్వు అలాగే చేయి, కొన్నాళ్ళకి అలవాటు అవుతుంది. చాదస్తాలు అన్నీ ఆచరిస్తూ పోతే కాలంతో పాటు మారడం కష్టం".

తిరుగుబాటు, విప్లవం, అభ్యుదయం ఇలాంటి పదాలు ఆవిడకి తెలియదు. కానీ ఆచరించడానికి అనువుగా లేని ఆచారాలు మార్చుకోడంలో ఎలాంటి అభ్యంతరం ఉండడం ఇష్టంలేదు ఆవిడకి.

నాంచారమ్మ పేరు విన్నా, ఆవిడని చూసినా ఎంతో సనాతన భావాలున్న స్త్రీ అనుకుంటారు అందరూ. కానీ ఆవిడ ఆలోచించినంత ఆధునికంగా ఎవరూ ఆలోచించరు.

చాముండేశ్వరి ఆవిడ మాటలు శిరసావహించింది. పవిత్రకి ఒక పళ్ళెం లో రెండు బూరెలు, గుప్పెడు పులిహోర పెట్టి ఇస్తూ "కొంచెం తినమ్మా! మావయ్యగారికి, మోహన్ కి భోజనాలు పెడతాను" అంది.

"ఒక బూరె తింటానండి ... మిగతాది అన్నంతో తింటాను " అంది పవిత్ర.

"సరేలే అలాగే కానీ" అందావిడ, మగవాళ్ళకి వెండి కంచాలు టేబుల్ మీద పెడుతూ.

పార్ధసారధి,మోహన్, మోహన్ అన్నగారు శివ ముగ్గురూ టేబుల్ దగ్గరకు వచ్చి కూర్చోగానే పవిత్ర అక్కడి నుంచి లేచి, తను చీర కట్టుకున్న గదిలోకి వెళ్ళిపోయింది.

ఆమెకి మోహన్ ని చూస్తుంటే కంపరంగా ఉంది. అతని కళ్ళల్లో తన పట్ల ఇష్టం, ఆరాధన చూస్తుంటే మరీ మండిపోతోంది.  కొన్ని మనస్తత్వాలు విచిత్రంగా ఉంటాయి. తమని ఇష్టపడేవాళ్ళని చూస్తే, వాళ్ళు అన్ని విధాలా మంచి వ్యక్తి అయినా ఆ వ్యక్తిలో లోపాలు  వెతికి, వేటాడి, ఆ మనిషిలో ఎక్కడో ఉన్న ఒక బలహీనతని అవకాశంగా వాడుకుని అవమానించడానికి ప్రయత్నిస్తారు. ఇప్పుడు పవిత్ర కూడా మోహన్ తనని ఇష్టపడడం అతని బలహీనతగా భావించి, ఆ బలహీనతని తనకి బలంగా మార్చుకోడానికి ప్రయత్నిస్తోంది. తనని ఇష్టపడుతున్నందుకు అతని మీద కోపంగా ఉంది, కానీ మరో పక్క నుంచి అతను తనపట్ల చూపించే శ్రద్ధ ఆమెకి గర్వంగా అనిపిస్తోంది. అది తన అందానికి అతను ఇస్తున్న సర్టిఫికేట్ లా భావిస్తోంది.

ఆలోచనల్లో ఉన్న పవిత్ర, “ పవిత్రా! రామ్మా భోంచేద్దాం“ అన్న నాంచారమ్మ స్వరం విని, భోజనాల గదిలోకి వచ్చింది.

నానమ్మ దగ్గరగా  వెళ్లి గొణిగింది.”చీర ఇంక మార్చుకోవచ్చా... అన్నం తినడం రాదు”  అంది .

ఆవిడ నవ్వి  “వెళ్లి మార్చుకో పర్లేదు”  అంది.

హమ్మయ్య అనుకుంటూ పరుగు, పరుగున గదిలోకి వెళ్లి చీర మార్చుకుని తన లంగా ఓణీ వేసుకుని వచ్చింది.

నానమ్మ పక్కన కూర్చుంటుంటే లోపల నుంచి భువనేశ్వరి స్వరం వినిపించింది. “ఏవిట్రా ఆ తినడం? ఇన్ని పదార్థాలు ఉంటే నీకేది నచ్చలేదా? ఎందుకలా కెలుకుతున్నావు?”

“ఆకలి లేదమ్మా” మోహన్ స్వరం .

“ఏం తిన్నావని ఆకలి లేకపోవడానికి? టిఫిన్ కూడా తినలేదుగా. ఏం వంటలు బాగాలేవా?”

“అయ్యో అదేం లేదమ్మా... చాలా బాగున్నాయి. ఈ సాంబారు బాగుంది. పులిహోర చాలా బాగుంది.. టమాట పచ్చడి ఇంకా బాగుంది.”

“అన్నీ బాగుంటే తినడానికేం? కలుపు పచ్చడి కలుపు నెయ్యి వేస్తాను.”

“వద్దమ్మా...వద్దు...” అతని మాటలు మధ్యలోనే ఆపుతూ,”తిను బాగుంది అన్నావుగా తిను.” అంది ఆవిడ.

“ఏంతో పరధ్యానంగా ఉన్నాడు. ఏంటిరా సంగతి?” శివ స్వరం వినిపించింది.

“అబ్బే ఏం లేదన్నయ్యా”

పవిత్ర నాంచారమ్మ మొహం లోకి చూసింది. ఆవిడ శ్రద్ధగా వింటోంది వాళ్ళ సంభాషణ. ఆవిడ పెదవుల మీద మందహాసం మెరిసింది. ఎడం చేత్తో పవిత్ర జుట్టు సవరించింది ఆప్యాయంగా.

పదినిమిషాల్లో మొగవాళ్ళ భోజనాలు అయిపోడం, పనమ్మాయి అక్కడ క్లీన్ చేయడం, “పిన్నిగారూ! బోజనాలకి రండి “ అని భువనేశ్వరి పిలవడం జరిగింది.

మగవాళ్ళు హాలులోకి రావడంతో వర్దని, నాంచారమ్మ, పవిత్ర లేచి భోజనాల గదివైపు నడిచారు.

ఆఖరున నడుస్తున్న పవిత్రకి మోహన్ ఎదురువచ్చాడు. ఆమె వైపు చూస్తున్న అతని కళ్ళల్లో ఆమె పట్ల అంతులేని ఆరాధన కనిపించింది. అది అర్థం కాని పవిత్ర మొహం చిట్లించుకుని వెళ్ళిపోయింది.

ఈమె కోసమేగా తను సరిగా మనసుపెట్టి తినలేకపోయాడు. ఆమెకి కొంచెం కూడా బాధలేదు. భారంగా శ్వాస తీసుకుని తలవంచుకుని వెళ్ళిపోయాడు.

వంకాయ ముద్ద కూర, టమాటా పచ్చడి, పప్పు, సాంబారు, అప్పడాలు, వడియాలు, పులిహోర, పూర్ణం బూరెలు, పరవాన్నం, అరటికాయ బజ్జీలు, రవ్వలడ్డు మొత్తం తొమ్మిది రకాల పిండివంటలతో షడ్రసోపేతమైన భోజనం. వద్దు, వద్దు అనుకుంటూనే తినేసింది.

రెండు కళ్ళు తనవైపు ప్రేమగానే కాదు, ఎంతో సంతృప్తిగా చూస్తున్నాయని ఆమెకి తెలియదు.

నానమ్మ, అమ్మతో కలిసి ఇంటికి వెళ్ళిపోయింది. అయితే, వచ్చేటప్పుడు ఉన్న పెడసరం ఆలోచనలు వెళ్ళేటప్పుడు లేకపోవడం ఆమె కూడా గమనించలేదు. అదే విచిత్రం.

ఆరోజు ఎందుకో తెలియదుకానీ పవిత్ర ముభావంగా ఉండిపోయింది ఇంటికి వెళ్ళాక.

కాలేజికి సెలవలు... ఇంట్లో ఉంటే ఏ మాత్రం అవకాశం లభించినా స్నేహితురాళ్ళను పోగేసి పచ్చీసో, క్యారంసో ఆడుకుంటూ, నాంచారమ్మని గంట, గంటకీ చిరుతిళ్ళు పెట్టమని వేధిస్తూ, ఇల్లంతా తెగ సందడి చేసే మనవరాలు మన్ను తిన్న పాములా మంచం మీద నుంచి లేవకపోవడంతో కంగారు పడిన నాంచారమ్మ గుప్పెడు ఉప్పు తీసుకుని ఆ పిల్ల గదిలోకి వచ్చింది.

మంచం మీద బోర్లా పడుకుని ఉన్న పవిత్రని బలవంతంగా లేపి, "రాగానే తిప్పేయాల్సింది మర్చిపోయాను. కళ్ళు తిప్పుకోలేనంత అందం ... దిష్టి తగలదూ! ఆ కుర్రాడి చూపంతా నీమీదే" అంటూ పవిత్ర తల మీద నుంచి గుండ్రంగా ఉప్పు పట్టుకున్న చేయి తిప్పుతూ, "ఇరుగు దిష్టి, పొరుగు దిష్టి, ఊళ్లోవాళ్ళ దిష్టి, అమ్మ దిష్టి, నాన్న దిష్టి " అంటూ ఏవేవో చదువుతుంటే కొంటెగా అంది పవిత్ర "నానమ్మ దిష్టి, మోహన్ గాడి దిష్టి" ఆవిడ తప్పు అన్నట్టు సంజ్ఞ చేసి, వెళ్లి ఉప్పు పారేసి చేయి కడుక్కుని వచ్చి, తడిచేత్తో పవిత్ర కళ్ళు తుడిచి అంది " పండగ కదా లేచి కొత్త బట్టలు కట్టుకుని గుడికి వెళ్లిరా "

"ఊహు... నాకు బద్ధకంగా ఉంది" గారంగా అంది పవిత్ర.

"పండగపూట బద్ధకం ఏవిటే, లేచి తయారవు. ఈలోగా గుడికి వెళ్లిరా, ఆరుగంటలాటకి సినిమాకి వెళ్దాము" అంది గొంతు తగ్గించి.

"అవునా. అయితే సరే." ఒక్క గెంతు తో మంచం దిగింది పవిత్ర.

స్నేహితుడి ఇంట్లో దసరా పూజలు ఉన్నాయని వర్ధనిని, పవిత్రని కూడా తనతో రమ్మని పిలిచాడు మాధవశర్మ.

పవిత్ర నానమ్మ వైపు దీనంగా చూసింది. ఆమె మనసు సినిమా మీద లగ్నం అయి ఉంటే, తండ్రి ఇంకెక్కడికో రమ్మని అనడం ఆమెకి నచ్చలేదు. రాను అని చెబితే ఊరుకునే రకం కాదు. ఏం చేయాలో తెలియలేదు. ఆ క్షణంలో తనని ఆ ఆపద నుంచి రక్షించే ఒకే ఒక వ్యక్తి  నానమ్మ. అందుకే ఆవిడ వైపు రక్షించవా అన్నట్టు చూసింది.

ఆవిడ కళ్ళతో సైగ చేసి, “ఏవిటోరా వాళ్ళింట్లో భోజనం చేసి వచ్చిన దగ్గర నుంచి పడుకునే ఉంది పిల్ల .. ఇప్పుడే దిష్టి తీశాను. అది వద్దులే ఇంట్లో ఉండనీ ఇవాల్టికి”  అంది.

“అరె అవునా! ఏరా ఇలారా”  ప్రేమగా కూతురుని దగ్గరకు పిలిచి, నుదుట చేయి వేసి చూస్తూ జ్వరం రాలేదుగా “ అన్నాడు.

నానమ్మ డ్రామాకి మరికొంచెం జీవం పోస్తూ “తలనెప్పిగా ఉంది నాన్నా” అంది.

“అయ్యో! సరేలే రెస్ట్ తీసుకో. నేనూ, అమ్మా వెళ్ళొస్తాము. “ అన్నాడు.

అంతకు ముందే అత్తగారు మనవరాలి చెవిలో రహస్యంగా  పూజాఫలం సినిమాకి వెళదాము అని చెప్పిన మాట విన్న వర్దని పళ్ళ బిగువున నవ్వుకుంది.

భార్యాభర్తలు ఇద్దరూ వెళ్లిపోయినట్టు కారు శబ్దం వినిపించగానే మంచం మీద నుంచి  కొమ్మ మీద  ఎగిరి వచ్చి వాలిన పక్షిలా వచ్చి, నాన్నమ్మని కావిలించుకుంది. “థాంక్స్ నానమ్మా “ అంటూ.

సరే, సరే, తయారవు. నేనీలోగా కాసిని పకోడీలు వేస్తాను. సినిమాహాల్లో తినచ్చు “ అంటూ వంటగది వైపు వెళ్ళింది నాంచారమ్మ.

అరగంటలో స్నానం చేసి, ఆకుపచ్చ జరీ బోర్డర్ ఉన్న తెల్లని పరికిణీ, ఆకుపచ్చ జర్జెట్ ఓణీ, తెల్ల జాకెట్ వేసుకుంది.  మెడలో ముత్యాల దండ, చెవులకి ముత్యాల జూకాలు, కంటి చివరిదాకా పుల్లతో అందంగా తీర్చిదిద్దుకుంది కాటుక. దోసగింజ బొట్టు.

“ఎంత బాగుంటాను నేను” మురిసిపోతూ అనుకుంది. అద్దం ముందు నుంచి కదలబోతుండగా “ఎంత బాగున్నావు పవిత్రా! బొండు మల్లెపూల దండలా ఉన్నావు.”  వెనక నుంచి గుమ్మంలో కనిపించాడు మోహన్.

గిరుక్కున వెనక్కి తిరిగింది. గుమ్మానికి ఉన్న కర్టెన్ గాలికి కదిలింది.

“హమ్మయ్య... శనిగాడు వచ్చాడేమో అనుకున్నా” అనుకుంటూ మెట్లు దిగి నానమ్మ దగ్గరకి వచ్చింది.

“ఇంద ఈ టిఫిన్ డబ్బా, ఈ మంచినీళ్ళ డబ్బా నీ బాగ్ లో పెట్టుకో, మొహం కడుక్కుని, చీర మార్చుకుని వస్తాను.” అంటూ పెరట్లోకి వెళ్ళిపోయింది నాంచారమ్మ.

రెండు డబ్బాలు తన బాగ్ లో పెట్టుకోడానికి వెనక్కి తిరిగిన పవిత్రకి “అమ్మో చచ్చాను నాయనోయ్ “ అనే నాంచారమ్మ ఆర్తనాదం వినిపించి, చేతిలో డబ్బాలు టేబుల్ మీద పెట్టి పెరట్లోకి పరిగెత్తింది.

ఆవిడ నూతి దగ్గర గట్టు మీద పడిఉంది. పవిత్ర వేగంగా వెళ్లి "అయ్యో ఎలా పడ్డావు నానమ్మా. లే... ఇదిగో నా చేయి పట్టుకో ... జాగ్రత్తగా లే " అంటూ ఆవిడని లేపడానికి ప్రయత్నించింది.

కానీ ఆవిడది భారీకాయం అవడం మూలంగా ఆ పిల్లకి చేతకాలేదు.

"అయ్యో కాలిరిగిందే తల్లి... మీ నాన్నను పిలుచుకురావే..."మూలుగుతూ అంది ఆవిడ.

"వాళ్ళ ఫ్రెండ్ ఇల్లు నాకు తెలీదుగా నానమ్మ... కొంచెం నా భుజం మీద చేయి వేసి లే " అంది ప్రాధేయపూర్వకంగా .

"నా వల్ల కాదే... నడుం విరిగిందే..." అని ఆవిడ రాగాలు పెట్టసాగింది.

అప్పుడే పెరటివైపు బాల్కనీ లోకి వచ్చిన మోహన్ ఆ దృశ్యం చూసి, గట్టిగా అరిచాడు.

"పవిత్రా! ఏమైంది నానమ్మగారికి?"

పవిత్ర తలెత్తి చూసింది. మోహన్ బాల్కనీ పిట్టగోడ దగ్గర నిలబడి ఉన్నాడు. గళ్ళ, గళ్ళ పైజామా, బనీను వేసుకుని ఉన్నాడు.

అతనంటే చిరాకు, ఆ వేషం మరీ చిరాకు. కానీ, అప్పటి పరిస్థితిలో అతని అవసరం ఎంత ఉందో అర్థం అయిన పవిత్ర తెచ్చిపెట్టుకున్న మర్యాదతో జవాబు చెప్పింది "

"పడిపోయింది. లేవడంలేదు".

"అరెరే. ఉండు నేను వస్తున్నాను." మోహన్ గిరుక్కున వెనక్కి తిరిగి అక్కడి నుంచి వెళ్ళిపోయాడు. పవిత్ర మరోసారి నాంచారమ్మని లేపడానికి ప్రయత్నించి విఫలం అయింది. నిస్సహాయంగా పైకి చూసింది.

మోహన్ షర్టు తొడుక్కుని వచ్చాడు.

ఆమె చూస్తూ ఉండగానే ఒక్క అంగలో పిట్ట గోడ మీద నుంచి కిటికీ మీదకి దూకి, అక్కడి నుంచి పవిత్ర వాళ్ళ పిట్టగోడ మీదకి ఎగిరి, అక్కడ నుంచి మళ్ళీ పెరట్లోకి దూకాడు.

మెరుపువేగంతో నాంచారమ్మ దగ్గరకు వచ్చి , రెండు చేతులతో ఆవిడని లేపబోయాడు.

"లేవలేనురా నాయన.. నా వల్ల కాదు" అందావిడ ఏడుస్తూ.

"కొంచెం ఓపిక పట్టండి." అని "పవిత్రా ఆ చేయి నువ్వు పట్టుకో" అంటూ పవిత్రకి పురమాయించి, బలవంతంగా ఆవిడని లేపాడు.

ఇద్దరూ నడిపించుకుంటూ వచ్చి, హాల్లో ఉన్న దివాన్ మీద పడుకోబెట్టారు.

ఆవిడ మూలుగుతూనే ఉంది. అమ్మా అయ్యా అంటూ.

“పోయినవారం మన ఊరికి కొత్త డాక్టర్ వచ్చారు. నేనెళ్ళి పిలుచుకువస్తాను... నువ్వు కొంచెం ఏదో ఒక నూనె వెచ్చ చేసి, ఆవిడ నడుము, కాళ్ళు మర్దనా చేయి.” అని చెప్పి, ఆమె సమాధానంకోసం చూడకుండా రివ్వున వీధి గుమ్మం వైపు దూసుకుని వెళ్ళాడు.

“నానమ్మా! నూనె మర్దనా చేయనా? కాపడం పెట్టనా?” నానమ్మ మూలుగులు గుండెని మెలితిప్పుతుంటే జాలిగా అడిగింది పవిత్ర.

“ఏదో ఒకటి చేయవే తల్లీ. ప్రాణం పోతోంది. మీ నాన్న, అమ్మ ఎప్పుడు వస్తారో? ఆ కుర్రాడు డాక్టర్ ని తీసుకువస్తానని వెళ్ళాడు ఇంకా రాలేదేవిటే “

నాంచారమ్మ మూలుగుతూ, ప్రశ్నల మీద ప్రశ్నలు సంధించసాగింది.

“వస్తాడు. డాక్టర్ ఇల్లు ఎక్కడో మనకేం తెలుసు. ఆయన వెళ్ళాలి, తీసుకురావాలి. ఈలోగా ఉండు నూనె వెచ్చ చేసి తీసుకువస్తాను. కొంచెం ఓర్చుకో నానమ్మా” అంటూ లోపలికి వెళ్ళింది.

ఆమె నూనె నువ్వుల నూనె వేడి చేసి తీసుకుని నాంచారమ్మ పడుకున్న దివాన్ దగ్గరకు వచ్చింది.

కాలిమీద చేయి వేయగానే కెవ్వు, కెవ్వు మంటున్న నానమ్మని చూస్తుంటే ఏడుపోచ్చేస్తోంది పవిత్రకి.

ఆవిడని ఓదారుస్తూనే, సున్నితంగా మూడువేళ్ళు నూనెలో ముంచి ఆవిడ కాలికి రుద్దుతూ ఉండగా వినిపించింది కారు హారన్.

“మీ నాన్న అమ్మా వచ్చినట్టున్నారే... చూడు, చూడు త్వరగా రమ్మను” అంది నాంచారమ్మ తొందరపెడుతూ.

పవిత్ర లేచి గుమ్మం దాకా వెళ్ళింది. గేటు అవతల కారు ఆగింది. ముందు మోహన్, అతని వెనుక మరో వ్యక్తి దిగారు.

డాక్టర్ ని తీసుకుని వచ్చినట్టున్నాడు ఇతను అనుకుంటూ పరిగెత్తుకుంటూ నాంచారమ్మ దగ్గరకు వచ్చి చెప్పింది “అమ్మా, నాన్న కాదు. డాక్టర్ ని తీసుకుని వచ్చినట్టున్నాడు కాకి”.

“తప్పు అలా అనకూడదు. ఆ అబ్బాయి వింటే బాధపడడూ. వెళ్లి డాక్టర్ గారికి కుర్చీ తీసుకురా నాన్న గదిలో నుంచి”.

నాంచారమ్మ మందలింపుతో నాలిక కరుచుకుని, తండ్రి ఆఫీస్ రూమ్ లోకి వెళ్లి కేన్ కుర్చీ తీసుకుని ఆ గడప దాటుతుండగా వినిపించింది మోహన్ స్వరం “రండి డాక్టర్ ” .

ఒళ్ళు మండింది పవిత్రకి. చనువుగా “రండి డాక్టర్” అంటూ స్వంత ఇంట్లోకి ఆహ్వానిస్తున్నట్టు ఏంటో ఆ పిలుపు అనుకుంటూ సీరియస్ గా గుమ్మం వైపు తిరిగింది.

ఆమె చేతిలో కుర్చీ గబుక్కున జారిపోయింది.

గుమ్మం పొడుగునా ఆరడుగుల విగ్రహం,

నల్లనివాడు, పద్మనయనమ్ముల వాడు,

నవ్వురా జిల్లెడుమోమువాడు ...

ఏదో అద్భుతం చూస్తున్నట్టు, కళ్ళు విప్పార్చుకుని, రెప్పవేయకుండా అలాగే చూస్తూ ఉండిపోయింది.

ఆరడుగుల పొడుగు, చామనచాయ,...

డాక్టర్ శివరామకృష్ణ ...

ఎంత బాగున్నాడు!

ఇతను డాక్టరా?

పాదాలు నేలకి అంటుకున్నట్టు శిలలా నిలబడిపోయింది.

ఎంత అందంగా ఉన్నాడు!  అతని పక్కన మోహన్ దిష్టిచుక్కలా.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS